## క్లుప్తంగా

### ప్రజలకు మెరుగైన వైద్యసేవలు


చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్ విద్యాసాగర్

**కోవెలకుంట్ల:** ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని డాక్టర్ విద్యాసాగర్ అన్నారు. రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గుండుపాపల గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషక ఆహార లోపం ఉన్న చిన్నారులు, రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ప్రభావతి, ఏఎన్‌ఎం ఖాజాబీ, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి పాల్గొన్నారు.

### స్ప్రేయర్ల పంపిణీ


రైతులకు స్ప్రేయర్లు అందజేస్తున్న దృశ్యం

**కోవెలకుంట్ల:** స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలువురి రైతులకు సబ్సిడీపై మంజూరైన తైవాన్ స్ప్రేయర్లను సోమవారం పంపిణీ చేశారు. సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాలకు చెందిన 25 మంది ఎస్సీ రైతులకు సబ్సిడీపై స్ప్రేయర్లు మంజూరు అయ్యాయి. ఆయా గ్రామాల రైతు భరోసా కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో సొదరదిన్నె, అమడాల గ్రామాల సర్పంచ్‌లు మధుసూదన్‌రెడ్డి, బాలమద్దిలేటి, ఉద్యానవన శాఖ అధికారిణి ధరణి, వ్యవసాయశాఖ అసిస్టెంట్ ధరణి పాల్గొన్నారు.

### జీపు జాతా విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శివబాలక్రిష్ణ

**బనగానపల్లె రూరల్:** ఈనెల 28, 29వ తేదీల్లో సీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించే జీపు జాతాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శివబాలక్రిష్ణ కోరారు. సోమవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన సీపీఐ, ఏఐటీయూసీ ముఖ్య నాయకుల సమావేశంలో శివబాలక్రిష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను జీపు జాతా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు సుబ్బయ్య, నాగాంజనేయులు, రామేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ప్యాపిలి-గుడిపాడు రోడ్డు పనుల పరిశీలన

**ప్యాపిలి:** మండల పరిధిలోని గుడిపాడు నుంచి ప్యాపిలి వరకు కొత్తగా వేస్తున్న రోడ్డు పనులను పీఆర్ ఏఈ ప్రభాకర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. పీఆర్ రోడ్ అసెట్స్ నిధులు రూ. 3.7 కోట్లతో ఈ పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. 5.2 కిలోమీటర్ల మేర చేపడుతున్న పనులు కొద్ది రోజుల క్రితమే ప్రారంభమయ్యాయన్నారు. పనులు నాణ్యతతో చేపట్టాలని ఆయన కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

### వృద్ధులకు సన్మానం


వృద్ధులను సత్కరిస్తున్న దృశ్యం

**డోన్ టౌన్:** ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వైఎస్ నగర్‌లోని హోసన్నా వృద్ధాశ్రమంలో సోమవారం వృద్ధులను నిర్వాహకుడు ప్రభాకర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యం ప్రతి మనిషి జీవితంలో తప్పనిసరి అనే విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఎదుగుదలకు కారణమైన తల్లిదండ్రులను వృద్ధాప్య దశలో బాగా చూసుకోవాలన్నారు.

### ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలి

**డోన్:** నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లు వేసి పేదలకు అంటగడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన మోహన్ సోమవారం స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ విద్యాసాగర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని 670-2 సర్వే నంబర్‌లో 5 ఎకరాల భూమిని నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లు వేసి గ్రామస్తులకు విక్రయించడమే గాకుండా ఇదే భూమిని బ్యాంకులో తనఖా పెట్టి అక్రమంగా లోన్లు పొందారని, విచారించి చర్యలు తీసుకోవాలని మోహన్ విన్నవించారు.


పారుతున్న సెలయేరు

- కొలిచిన భక్తులకు కొంగు బంగారంగా వెలుగొందుతున్న రంగనాథుడు
- శ్రీదేవి, భూదేవి సమేత నిత్యం ఉత్తర ద్వారం దర్శనంలో స్వామివారు
- పరవశించిపోతున్న భక్తులు

ఒకవైపు పచ్చని చెట్లు.. మరోవైపు రాతి అందాలు.. వీటిన్నింటినీ మించి కొండకోనల మధ్య గళగల పారే సెలయేరు.. వెరసి ఆహ్లాదకరమైన వాతావరణంలో పవళించి ఉన్న పాలుట్ల రంగనాథుడి రూపం ముగ్ధమనోహరం. కొలిచిన వారికి కొంగుబంగారంగా వెలుగొందే రంగనాథుడి దర్శనానికి వచ్చే భక్తులకు ఇక్కడి అందాలు స్వాగతం పలుకుతూ కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ఆదిశేషుడు పాన్పుకాగా.. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువై ఉన్న పాలుట్ల రంగస్వామిని భక్తులు దర్శించి పరవశించిపోతున్నారు.

# ప్రకృతి అందాల మధ్య పాలుట్ల రంగనాథుడు


రాతి అందాల మధ్య పాలుట్ల రంగనాథస్వామి

**బేతంచెర్ల:** శ్రీదేవి, భూదేవి సమేత పాలుట్ల రంగనాథస్వామి ఆలయం బేతంచెర్ల మండలం గూటుపల్లె, వెల్దుర్తి మండలం శ్రీరంగాపురం గ్రామాల మధ్య ఉంది. ఆలయం కొండల మధ్య, సహజ సెలయేరు పక్కన ఉత్తరాభి ముఖంగా ఉండటంతో భక్తులకు స్వామి వారి నిత్య ఉత్తర ద్వార దర్శన భాగ్యం లభిస్తోంది.

**ప్రాచుర్యంలో ఉన్న కథ..**

పూర్వం వైకుంఠంలో శ్రీమన్నారాయణుడు లక్ష్మీదేవితో ఏకాంతంగా ఉన్న సమయంలో భృగు మహర్షి అక్కడకు చేరుకున్నాడు. ఆయన రాకను గమనించని లక్ష్మీనారాయణులు అలాగే సేద తీరుతుండగా ఆగ్రహించిన భృగు మహర్షి.. శ్రీమన్నారాయణుడి ఎదలపై కాలితో తన్నాడు. వెంటనే స్వామి వారు లేచి భృగు మహర్షి కాళ్లను పట్టుకుని శాంతించవలసిందిగా కోరాడు. స్వామి వారు మాత్రం మహర్షి కాళ్లు నొక్కుతూ నొక్కుతూ కుడి అరి కాలిలో ఉన్న మూడో నేత్రాన్ని అదిమిపట్టడంతో కోపం తగ్గిపోయింది. అప్పుడు మహర్షికి జ్ఞానోదయమైంది. 'మహానుభావా నీ మహిమను కనలేక కాలితో తన్నాను. నన్ను మన్నించు' అంటూ నారాయణునికి సాష్టాంగ నమస్కారం చేశాడు.

**స్వామిపై అలిగి అమ్మవారు.. ఆమెను వెతుకుతూ స్వామి..**

తనకే సొంతమైన భర్త ఎదలపై మహర్షి కాలితో తన్నినా కోపగించుకోకపోవడంతో పాటు అతని కాళ్లు నొక్కడం ఏమాత్రం జీర్ణించుకోలేని అమ్మవారు లక్ష్మీదేవి తీవ్ర అవమానంగా భావించింది. శ్రీమన్నారాయణుడితో వాదనకు దిగింది. భృగు మహర్షి గొప్పతనం, విధి రాతలను వివరించినా ఆమె శాంతించలేదు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన నారద మహర్షి సైతం శాంతపరచడానికి యత్నించి విఫలమయ్యాడు. లోకాకే తల్లిదండ్రులైన తమరు ఇలా వాదులాడుకోవడం తగదని హితవు పలికినా శాంతించకపోవడంతో పాటు తాను ఇక్కడ ఉండేది లేదంటూ వైకుంఠం వదలి భూలోకానికి వచ్చింది. అనేక ప్రదేశాలు తిరిగి చివరకు మనోహరమైన శ్రీరంగాపురం సమీపంలోని కొండల వద్ద కొలువైంది. ఆమెను వెదుకుతూ శ్రీమన్నారాయణుడు సైతం వైకుంఠాన్ని వీడి భూలోకం చేరాడు. స్వామీఅమ్మవారు పారుతున్న సెలయేటి సమీపంలో లక్ష్మీరంగనాథస్వాములుగా కొలువై పూజలుందుకుంటున్నారు.


కొలువైన పాలుట్ల రంగనాథస్వామి ఆలయం


కనువిందు చేస్తున్న పచ్చని అడవి అందాలు

**పాల ముంతలతో ఉట్లు కొట్టడంతో పాలుట్ల రంగనాథుడిగా..**

స్వామి వారికి కృష్ణాష్టమికి గోపస్త్రీ, యువకులు పాల ముంతలతో ఉట్లు కొట్టేవారు. ఈ సంప్రదాయం కారణంగా పాలుట్ల రంగనాథ స్వామిగా ప్రాచుర్యం పొందాడు. పాలుట్ల రంగనాథస్వామి పేరు మీదుగా శ్రీరంగాపురం, లక్ష్మీదేవి పేరుమీద లక్ష్మీపల్లె గ్రామాలు వెలిశాయి. దేవదాయశాఖలో ఆలయం చేరిన తరువాత గాలిగోపురం, ముఖమండపం అనేక నిర్మాణాలు జరిగాయి. ఇక్కడి సెలయేటిలో నీరు స్వచ్ఛంగా ఉంటుంది. శ్రీదేవి, భూదేవి సమేత పాలుట్ల రంగనాథస్వామిని ఉమ్మడి జిల్లా కర్నూలు నుంచే కాకుండా అనంతపురం, బెంగళూరు, హైదరాబాద్, చైన్నె ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకుంటుంటారు.

**రంగనాథ స్వామికి ఏడుకొండలు**



ఈస్వామి సాక్షాత్తు సప్తగిరీశుడే. శ్రీరంగనాథ స్వామికి ఏడు కొండలు ఉన్నాయి. వినాయకుని కొండ, గోవుల సేల కొండ, వాసుదేవుని కొండ, కాటమరాజు కొండ, లోవేనకొండ, వేకుల వీడు కొండ, కొండమెరుపుల కొండలు ఉన్నాయి. వేంకటేశ్వరస్వామికి మాదిరిగా ఈ స్వామికి కూడా ఏడు కొండలు ఉన్నాయి. – లక్ష్మీరమణ, భక్తుడు

**సంతాన వరప్రదాయుడు**



శ్రీరంగనాథస్వామి కొలిచిన భక్తుల కొంగు బంగారం. సంతాన వరప్రదాయుడిగా వెలుగొందుతున్నాడు. ఇక్కడ శ్రావణ మాసం, కార్తీక మాసంలోనే కాకుండా ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం. ప్రతి శనివారం భక్తులు తరలి వచ్చి మొక్కులు చెల్లిస్తుంటారు. దాతల సహకారంతో గత ఏడాది నూతనంగా సుమారు రూ.18 లక్షలతో రథం ఏర్పాటు చేశారు. స్వామి వారి భక్తులు వారి పిల్లలకు లక్ష్మీరమణ, శ్రీరమణ, రంగస్వామి, శ్రీమహాలక్ష్మీ పేర్లు పెట్టుకుంటారు. – విష్ణువర్ధన్ ఆచార్యులు, ఆలయ అర్చకుడు

## అభివృద్ధికి పట్టం


మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి

**బేతంచెర్ల:** ఈనెల 19న జరిగిన సర్పంచ్, వార్డు సభ్యుల ఉ ఎన్నికల్లో ఓటర్లు అభివృద్ధికే పట్టం కట్టారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు అన్నారు. గెలుపొందిన ఎం.పెండేకల్లు 10వ వార్డు మిట్ట వేణుగోపాల్ రెడ్డి, రహిమానుపురం 6వ వార్డు సభ్యుడు బి.ప్రసాద్, అంబాపురం చిన్న మద్దమ్మ(ఇండిపెండెంట్)ను సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చూసి వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను ప్రజలు గెలిపించారన్నారు. కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ, మద్దిలేటి స్వామి ఆలయ మాజీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధిలో మహిళలకు శిక్షణ


మాట్లాడుతున్న హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యురాలు


**డోన్:** పూలతో వస్తువులను తయారు చేయడంతో పాటు సబ్బులు, కొవ్వత్తులు, సుగంధ ద్రవ్యాలను తయారు చేయడంలో డ్వాక్రా మహిళలకు ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు తాడేపల్లిలోని హార్టికల్చర్ యూనివర్సిటీలో శిక్షణ ఇవ్వనున్నట్లు డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యురాలు సప్తశైల సుమిత్ర రాజేష్ తెలిపారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో డ్వాక్రా మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అమ్ముడుపోని పూలను చెత్తకుండీలో పడవేయకుండా వాటిని పుష్పప్రసాదం పేరుతో తిరిగి వినియోగించేలా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇప్పటికే డ్వాక్రా మహిళలకు సబ్బులు, అగర్‌బత్తీలు, కొవ్వత్తులు, పూల సువాసనలు వచ్చే సుగంధ ద్రవ్యాలు, రంగులు తయారు చేయడంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ శిక్షణ ఇవ్వనుందన్నారు. తాడేపల్లిలో మూడు రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమానికి డోన్ నుంచి డ్వాక్రా మహిళల బృందాన్ని పంపుతామన్నారు. సమావేశంలో మెప్మా టీఎంసీ సుజాత పాల్గొన్నారు.

## చోరీకి విఫలయత్నం


తాళం పగుల కొట్టడానికి యత్నిస్తున్న అంగతకుడు

**డోన్ టౌన్:** పట్టణంలోని గుత్తి రోడ్డులో ఉన్న అమ్మ హోటల్ వద్ద ఓ కిరాణం దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తి చోరీకి యత్నించిన ఘటన సోమవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. ఇనుప రాడ్‌తో షట్టర్ తాళం పగులగొట్టడానికి యత్నించినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. ఒక వైపు తాళం మాత్రమే పగిలి, రెండో తాళం ఎంతకూ పగలకపోవడంతో దుండగుడు చేసేదేమీ లేక వెనుదిరిగాడు. ఉదయం యజమాని బలిజ శంకర్ దుకాణం వద్దకు చేరుకోగా ఒకవైపు తాళం పగిలిపోయి ఉండటం చూసి సీసీ టీవీని పరిశీలించాడు. వస్తువులు, నగదు చోరీకి గురికాకపోవడంతో ఫిర్యాదు చేయలేదని బాధితుడు తెలిపాడు. కాగా ఆదివారం రెండు ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్ ఘటనలు చోటుచేసుకున్నాయి. అంతలోనే ఈ ఘటన వివరాలు వాట్సాప్‌లో చక్కర్లు కొట్టడంతో పట్టణ వాసులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి పోలీసుల గస్తీ పెంచాలని పలువురు కోరుతున్నారు.

## నీటి విడుదల సామర్థ్యం పెంచాలి


ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వ ద్వారా నీటి ప్రవాహం

**బనగానపల్లె:** ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వ ద్వారా విడుదలను నీటి సామర్థ్యాన్ని పెంచాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఎస్సార్‌బీసీ ఆయకట్టు పరిధిలో 1.62 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా బనగానపల్లె నియోజకవర్గంలో సుమారు 62 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. నియోజకవర్గంలో వర్షాధారంగా ఖరీఫ్‌లో ఆయకట్టు పరిధిలో 15 వేల ఎకరాల్లో మొక్కజొన్న పత్తి కంది మిరప తదితర పంటలను రైతులు సాగు చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కాగా నెల రోజులుగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో వేసిన పంటలు ఎండిపోతున్నట్లు రైతులు వాపోతున్నారు. గోరుకల్లు రిజర్వాయర్‌కు అనుసంధానంగా ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వ ఉన్నందున శ్రీశైలం ప్రాజెక్టు నుంచి గోరుకల్లు రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేయడంతో ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వ ద్వారా నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం ప్రధాన కాల్వ ద్వారా కొంత మేర మాత్రమే నీరువస్తున్నందున నీటి విడుదలను పెంచితే సాగు చేసిన పంటలకు కాపాడుకుంటామని రైతులు కోరుతున్నారు.

## ఉద్యోగాల పేరుతో మోసం..అరెస్ట్

**ఆళ్లగడ్డ:** కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ ఆయుష్మాన్‌భారత్ విభాగంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసిన తల్లి, కుమార్తెను పట్టణ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పట్టణ సీఐ రమేష్ బాబు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని నల్లబోతుల జయలక్ష్మి, ఆమె కూతురు నల్లబోతుల మధులత.. షేక్ జాకీర్ హుసేన్, మరి కొందరు నిరుద్యోగ యువకులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి సుమారు రూ.30 లక్షల వరకు డబ్బులు వసూలు చేశారు. కొన్ని రోజుల పాటు ఏవో కాగితాలు ఇచ్చి ఉద్యోగాలకు ఎంపికయ్యారని త్వరలో కాల్ లెటర్‌లు వస్తాయని, ఎక్కడ జాయిన్ కావల్సింది అందులో ఉంటుందని నమ్మబలికారు. సంవత్సరాలు గడిచినా కాల్ లెటర్ రాక పోవడంతో వారిని నిలదీశారు. దీంతో వారి నుంచి సమాధానం కరువవడంతో జాకీర్ హుసేన్ పట్టణ పోలీసులు ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న సీఐ విచారణ చేపట్టి నిందితులను అరెస్ట్ చేసి కోవెలకుంట్ల కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారని సీఐ వివరించారు.

### డ్రంకెన్ డ్రైవ్‌లో జైలు శిక్ష

**నంద్యాల(వ్యవసాయం):** పట్టణంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన నిందితుడికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్‌రెడ్డి జైలుశిక్ష ఖరారు చేశారని పోలీసులు సోమవారం తెలిపారు. వివరాలు.. ట్రాఫిక్ పోలీసులు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో రమేష్ మద్యం సేవించి మోటారు సైకిల్ నడిపినందుకు పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా ఏడు రోజులు జైలు శిక్ష ఖరారు చేసినట్లు చెప్పారు.

### రైతు భరోసా కేంద్రాలు తనిఖీ

**ప్యాపిలి:** మండల పరిధిలోని కలచట్ల, పెద్దపొదిళ్ల గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను మండల వ్యవసాయాధికారి రాజేశ్ సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. తప్పనిసరిగా ఈ క్రాప్ బుకింగ్ చేసుకునేలా రైతులను చైతన్యం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సమయానికి విధులకు హాజరుకావాలని, రైతులకు అందుబాటులో ఉండి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు.

### ఓపెన్ ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

**సంజామల/కొలిమిగుండ్ల:** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్య (ఓపెన్ ఇంటర్) అడ్మిషన్లు ప్రారంభమైనట్లు సంజామల, కొలిమిగుండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు తెలిపారు. సోమవారం వారు వేర్వేరుగా మాట్లాడుతూ పదో తరగతి పాసై.. ఆర్థిక స్తోమత, ఇతర కారణాల వల్ల రెగ్యులర్ ఇంటర్ చదవలేని విద్యార్థులు ఈనెల 30వ తేదీలోపు తమ కళాశాలల్లో సంప్రదించి అడ్మిషన్ పొందాలన్నారు.

### ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**డోన్ టౌన్:** జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో మూడో విడత ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, డోన్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22 నుంచి 27వ తేదీలోపు iti.ap.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ప్రింట్ తీసుకొని ఒరిజినల్ సర్టిఫికెట్లతో 28వ తేదీలోపు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల్లో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. 30వ తేదీ ఉదయం 10 గంటల నుంచి జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

### ఈక్రాప్ బుకింగ్ తప్పనిసరి

**సంజామల:** సాగు చేసుకున్న పంటలను తప్పనిసరిగా రైతులు ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి సూచించారు. సోమవారం ఏఓ మాట్లడుతూ మండలంలో జోరుగా పంట నమోదు ప్రక్రియ సాగుతుందన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగితే అందజేసే పరిహారం పంటల బీమా వంటి పథకాలకు ఈ క్రాప్ బుకింగ్‌ను ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకుంటుందన్నారు. రైతులు ఏ పంటను సాగు చేశారో అదే పంటకు ఈ క్రాప్ నమోదు అవుతుందన్నారు.

### పగటి వేళల్లో విద్యుత్ సరఫరా చేయాలి

**కోవెలకుంట్ల:** ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ పనులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో విద్యుత్ సరఫరా చేయాలని మండల ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్ కోరారు. సోమవారం స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయంలో ఏఈ రాంమోహన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి ప్రస్తుతం తెల్లవారుజామున 5 నుంచి మాధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తున్నారన్నారు. తెల్లవారుజామున రైతులు, కూలీలు పొలాలకు వెళ్లి సాగునీటిని మళ్లించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలా కాకుండా ప్రతి రోజు ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా చేయాలని కోరారు.

### అనాథ శవానికి అంత్యక్రియలు

**డోన్:** స్థానిక రైల్వేస్టేషన్ పరిసరాల్లో యాచక వృత్తితో జీవిస్తున్న అనాథ మహిళ అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతిచెందింది. సోమవారం పోలీసుల ద్వారా విషయం తెలుసుకున్న ద్రోణాచలం సేవాసమితి ఆత్మబంధువు సభ్యులు గురుస్వామి, ఆటో సుధాకర్, ఫొటోగ్రాఫర్ బాబా, టైలర్ శ్రీను అక్కడికి చేరుకుని మహిళ మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించి హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. కాగా వైఎస్సార్ సీపీ నాయకులు మల్యాల శ్రీనివాసరెడ్డి, రోటరీ క్లబ్ సభ్యులు రాజయ్యగౌడ్, ప్రైవేట్ లెక్చరర్ చంద్రశేఖర్‌రావు ఆర్థిక తోడ్పాటు అందించారు.

## ముస్లిం మైనారిటీల అభివృద్ధికి కృషి


షాదీఖానా నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన

**బేతంచెర్ల:** ముస్లిం మైనారిటీల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నట్లు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. స్థానిక శ్రీనగర్ కాలనీలోని షాదీఖానాలో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న వంటశాల, డైనింగ్ హాల్ పనులను మంత్రి పరిశీలించారు. అనంతరం పనులు పురోగతిపై చర్చించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ముస్లింలతో సమావేశమై పలు విషయాల గురించి చర్చించారు. ముస్లింల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఉర్దూ అకాడమీ సభ్యులు ముర్తుజావలి, స్టేట్ మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజా హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

### పెరటి కోళ్ల పెంపకం చేపట్టాలి


పాడి రైతులకు పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న కేవీకే శాస్త్రవేత్త ధనలక్ష్మి

**బనగానపల్లె రూరల్:** వ్యవసాయం, పాడి పశువులతో పాటు జీవాలు, పెరటి కోళ్ల పెంపకం చేపట్టి ఆర్థికంగా ఎదగాలని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మి రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని యాగంటిపల్లె గ్రామ సమీపంలో ఉన్న కేవీకేలో జాతీయ వాతావరణ వినూత్న వ్యవసాయ పథకం కింద రైతులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశుపోషణ వల్ల పంటలకు అవసరమైన పేడ ఎరువులు లభిస్తాయన్నారు. ఈ ఎరువులతో నేల సారవంతమవుతుందని, రసాయన ఎరువుల ఖర్చు తగ్గుతుందని చెప్పారు. కేవీకే పశుపోషణ శాస్త్రవేత్త కృష్ణమూర్తి సన్న, చిన్న జీవాలైన మేకలు, గొర్రెల్లో వచ్చే వ్యాధులు వాటి నిర్ధారణ పద్ధతులు, పాశువుల్లో వచ్చే చర్మవ్యాధులు, గాలికుంటు, గొంతువాపు నివారణ పద్ధతుల గురించి రైతులకు వివరించారు. అనంతరం రైతులకు రాజశ్రీ కోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమలో చెర్లో కొత్తూరు, చిన్నరాజుపాళెం, మీరాపురం గ్రామాల రైతులు, కేవీకే ఏఓ సురేష్‌కుమార్, శాస్త్రవేత్తలు సుధాకర్, బాలరాజు, రవిగౌడ్ పాల్గొన్నారు.

## చలో విజయవాడను జయప్రదం చేయండి


కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**డోన్ టౌన్:** ఈనెల 24న విజయవాడలో జరిగే మున్సిపల్ కార్మికుల ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల అధక్షులు, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, శివరాంలు విజ్ఞప్తి చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం కార్మికులతో సమావేశమై అనంతరం కమిషనర్ వెంకటరామిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ విభాగంలో ఆప్కాస్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కుళ్లాయప్ప, అధ్యక్ష, పాధ్యక్షులు గోవిందు, పెద్ద ఎల్లయ్య, నాయకులు దేవదానం, ఏసు, నాగరాజు, అవులయ్య, అంజనమ్మ, లక్ష్మి వెంకటలక్ష్మి, మాదమ్మ ఉన్నారు.

### ప్రారంభానికి ముస్తాబు


గ్రామంలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న భవనాలు

**బేతంచెర్ల:** ప్రభుత్వ భవనాలు ప్రారంభానికి ముస్తాబయ్యాయి. మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామంలో రూ.35 లక్షలతో సచివాలయం, రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రూ.15 లక్షలతో బల్క్ మిల్క్ సెంటర్ నిర్మాణాలు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. కాగా గ్రామంలో ఒకేచోట సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, బల్క్ మిల్క్ సెంటర్ ఏర్పాటుతో గ్రామస్తులకు సౌకర్యంగా మారనున్నాయి.

### బైక్ యాత్రను జయప్రదం చేయాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

**డోన్ టౌన్:** విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు చేపట్టిన విద్యార్థి సంగ్రామ బైక్ యాత్రను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు మహబూబ్‌బాషా, అశోక్ కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం బైక్ యాత్రకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు ఇవ్వాలన్నారు. ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని, మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, జీఓ నంబరు 77 రద్దు చేయాలనే తదితర డిమాండ్లతో చేపట్టిన బైక్ యాత్రకు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సురేష్, సోమనాథ్ రెడ్డి, గిడ్డయ్య పాల్గొన్నారు.